క్లుప్తంగా

డీఈఓకు వినతి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేట్ పాఠశాల నిర్వాహకులు

దేవరకొండ : పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న శ్రీచైతన్య టెక్నో స్కూల్‌కు అనుమతులు ఇవ్వవద్దని డీఈఓ భిక్షపతికి దేవరకొండ, కొండమల్లేపల్లి ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల ఏర్పాటు సమీపంలో బార్‌తో పాటు ఫంక్షన్‌హాల్ ఉండడంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతాయని వారు పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాజ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, లింగం, జంగయ్య, రామకృష్ణ, తదితరులున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం



సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న బీజేపీ నాయకులు

మాడుగులపల్లి : ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆదేశాలమేరకు మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా కాంటాలు వేసి ధాన్యాన్ని కొనుగోలు చేసి తరలించకుండా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. లేనట్లయితే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి, బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యదర్శి పాపయ్యగౌడ్, జాతీయ కార్యవర్గసభ్యులు గోలి మధుసూదన్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఇటికాల జాన్‌రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కాంటా వేయాలి

వేములపల్లి : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకొచ్చిన ధాన్యానికి కాంటాలు వేసి వెంటనే కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని సల్కునూరు ఐకేపీ కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. కేంద్రాల్లో రైతులు రాశులుగా ధాన్యాన్ని పోసి రోజులు గడుస్తున్నా ఇంతవరకు కాంటాలు వేయకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జిల్లా యాదగిరి, కనకయ్య, రంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, సత్యం, రోశయ్య, యశోద, లింగమ్మ, లక్ష్మమ్మ, కలమ్మ, ఎల్లయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిడమనూరు : పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను కోరారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బోనగిరి రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నానుద్దేశించి కొండేటి శ్రీను మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ వద్ద 16న మహాధర్నా, 19 తర్వాత సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కొమాండ్ల గురువయ్య,ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, రెమడాల సత్యనారాయణ, విజయ్, చిత్రం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ రాములు యాదవ్

మాడుగులపల్లి : మండలంలోని గండ్రవానిగూడెంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని వేములపల్లి పీఏసీఎస్ చైర్మన్ జడ రాములు యాదవ్ ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయమే కీలకం !

- మున్సిపాలిటీకి స్వచ్ఛ ర్యాంకులు కేటాయింపునకు సర్వే
- పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది



చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్(ఫైల్)

దేవరకొండ : కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ, స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో ప్రతీ ఏటా పట్టణాల శుభ్రతపై సర్వే నిర్వహించడం జరుగుతుంది. క్షేత్ర స్థాయిలో ఆయా మున్సిపాలిటీల్లో పరిశుభ్రతను పరిశీలించి మార్కులు కేటాయించనున్నారు. 2024–2025ఏడాదికి గాను ఇప్పటికే స్వచ్ఛ సర్వేక్షన్‌కార్యక్రమాలను ప్రారంభించారు. దేవరకొండ మున్సిపాలిటీలో ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ సాధించడం కోసం మున్సిపల్ అధికారులు కృషి చేస్తున్నారు. మున్సిపాలిటీలో విడుతల వారీగా సంబంధిత అధికారులు పౌరుల నుంచి అభిప్రాయాలను తీసుకోవడం ప్రారంభించారు. గత నెల 15న ప్రారంభమైన సర్వే కొనసాగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. స్వచ్ఛ యాప్ లేకుంటే స్వచ్ఛ భారత్ అర్బన్ వెబ్‌సైట్‌తో పాటు క్యూ ఆర్ కోడ్ ద్వారా కూడా అభిప్రాయాలను తెలపాల్సి ఉంటుంది.

మొత్తం మార్కులు	12,500
ఓడీఎఫ్.వాటర్	1200
గార్బేజ్ ఫ్రీ సిటీ	1300
మిగిలిన అంశాలన్నింటికీ	10,000

మార్కులు ఇలా..

స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా పౌరుల అభిప్రాయాలను తెలిపేందుకు స్వచ్ఛ యాప్ లేకుంటే స్వచ్ఛ భారత్ అర్బన్ వెబ్‌సైట్‌లో అభిప్రాయాలను సేకరిస్తున్నారు. మొత్తం మార్కుల్లో పది శాతం ఈ విభాగానికి కేటాయించారు. దీని ఆధారంగా ర్యాంకుల ప్రకటన ఉండనున్నట్లు తెలుస్తుంది. పౌరుల అభిప్రాయాల సేకరణకు మున్సిపాలిటీలో కార్యాచరణ చేపట్టింది.

ఇవే.. ఆ పది ప్రశ్నలు

- రోజు చెత్త సేకరించేందుకు మున్సిపల్ వాహనం మీ ఇంటికి /దుకాణానికి వస్తుందా ?
- మీ ప్రాంతాన్ని రోజూ ఊడుస్తూ పరిశుభ్రంగా ఉంచుతున్నారా?
- మీ ప్రాంతంలో చెత్త కుప్పలు పేరుకుపోవడం వంటివి తరుచూ కనిస్తాయా?
- ఇంటిలోని చెత్తను తడి, పొడిగా వేరు చేసి ఇస్తున్నారా?
- స్వచ్ఛ ఆటోల వారు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారా?కలిపి సేకరిస్తున్నారా ?
- మార్కెట్లు, బజార్లు, పార్కులు, ఉద్యాన వనాలు ఇతర ప్రాంతాల్లోని బహిరంగ ప్రదేశాల్లో పరిశుభ్రతను నిర్వహించడంలో స్థానిక అధికారులు ఎంత ప్రభావితంగా ఉన్నారని మీరు అనుకుంటున్నారు?
- మీ మున్సిపాలిటీలో రెడ్యూస్,రీ యూజ్,రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) చెత్త కేంద్రాలను గుర్తించిన విషయం మీకు తెలుసా?
- మున్సిపాలిటీలో మురుగు కాలువలు,సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేయడానికి లైసెన్స్ లు పొందిన ఆపరేటర్లను మాత్రమే నియమించుకోవాలని మీకు తెలుసా?
- మీ ప్రాంతంలో పబ్లిక్ టాయిలెట్స్‌లో శుభ్రత నిర్వహణపై ఎంత వరకు సంతృప్తి చెందారు?
- మీరు ఎప్పుడైనా పారిశుద్ధ్య సమస్యలను స్థానిక అధికారులకు రిపోర్ట్ చేశారా? దానిని ఏ విధంగా పరిష్కారం చేశారు? అనే విషయాలపై అభిప్రాయాలను సేకరిస్తున్నారు.

మున్సిపాలిటీని అగ్రభాగాన నిలుపుతాం



దేవరకొండ మున్సిపాలిటీని ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది సహకారంతో స్వచ్ఛతలో అగ్రభాగాన నిలుపుతాం. సర్వేలో క్యూఆర్ కోడ్ ద్వారా అభిప్రాయ సేకరణ ఉంటుంది. ఇన్‌ఫర్మేషన్ ఎడ్యుకేషన్ కమ్యూనికేషన్(ఐఈసీ) కింద స్వచ్ఛ్ సర్వేక్షన్‌కు రూ.7 లక్షల వరకు మంజూరయ్యాయి. ఆ నిధులతో స్వచ్ఛతపై వాల్ పెయింటింగ్, వార్డుల్లో ప్రజలకు, ప్లాస్టిక్ నియంత్రణపై వ్యాపారులకు అవగాహన కార్యక్రమాలు వంటి పనులు చేపట్టాం.

– సక్రునాయక్, ఎన్విరాన్‌మెంటల్, ఇంజనీర్

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



విద్యార్థినులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడిస్తున్న కలెక్టర్

పెద్దవూర : పాఠశాల దశలోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని సమీకృత బాలికల వసతిగృహాన్ని తనిఖీ చేసి విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా 'నేను ఎవరిని' అని విద్యార్థులను అడుగగా మీరు కలెక్టర్ మేడం అని విద్యార్థులను సమాధానం చెప్పారు. బాగా చదివి తల్లిదండ్రులకు గురువులకు సమాజానికి మంచి పేరు తీసుకుని రావాలని కలెక్టర్ స్థాయి నుంచి ప్రధానమంత్రి స్థాయికి ఎదగాలన్నారు. ఐఐటీ, క్రిటికల్ కేర్ యూనిట్ అంటే ఏమిటని ప్రశ్నించారు. ఐఐటీ సాధించాలంటే లెక్కలతోపాటు సైన్స్‌లో పర్ఫెక్ట్‌గా ఉండాలని, డాక్టర్ కావాలంటే ఇప్పటి నుంచే సైన్స్‌ను అవగతం చేసుకోవాలన్నారు. గతంలో పాఠశాల తనిఖీ కి వచ్చిన సమయంలో హాస్టల్‌లో సమస్యలను క్షేత్ర స్థాయిలో తెలుసుకున్న కలెక్టర్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి విన్నవించారు. స్పందించిన మంత్రి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రూ.30లక్షలతో అన్ని రకాల మౌలిక వసతులు సమకూర్చారు. దీంతో గురువారం హాస్టల్ తనిఖీకి వచ్చిన కలెక్టర్‌కు విద్యార్థినులు కృతజ్ఞతలు తెలుపగా వెంటనే కలెక్టర్ జిల్లా మంత్రి వెంకట్‌రెడ్డికి ఫోన్ చేసి విద్యార్థినులతో మాట్లాడించగా మంత్రికి విద్యార్థినులు కృతజ్ఞతలు తెలిపారు. పదినిమిషాల సేపు విద్యార్థినులతో సంభాషించి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలన్నారు. కలెక్టర్ గంటకుపైగా విద్యార్థినులతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఆమె వెంట మిర్యాలగూడెం సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్, డీటీసీఓ ఎస్సీ రాజ్‌కుమార్, తహసీల్దార్ ఎం. శ్రీనివాసులు, ఎంపీడీఓ సుధీర్‌కుమార్, ఆర్ఐ దండ శ్రీనివాస్ రెడ్డి , వార్డెన్ అహల్యారెడ్డి తదితరులు ఉన్నారు.

నెలకొరిగిన సూచిక బోర్డులు



సంజీవని ట్రస్ట్ సమీపంలో నెలకొరిగిన సూచిక బోర్డు

కొండమల్లేపల్లి : 167వ జాతీయ రహదారిపై మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామ సమీపంలోని సంజీవని ట్రస్ట్ సమీపంలో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు విరిగి కిందపడి ఉన్నాయి. దూర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు సూచిక బోర్డులు ఉపయోగపడుతాయి. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి సూచిక బోర్డులను తిరిగి ఏర్పాటు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

పేదల కడుపు నింపేందుకే సన్న బియ్యం

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



మిర్యాలగూడ : సన్న బియ్యం లబ్ధిదారులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

మిర్యాలగూడ : నిరుపేదల కడుపు నింపేందుకే ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పలు చోట్ల సన్న బియ్యం లబ్ధిదారుల ఇళ్లలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌తో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కడికి వెళ్లినా పేద ప్రజలు తాము సన్న బియ్యంతో కడుపు నిండా తింటున్నామని ఆనందంగా చెబుతున్నారన్నారు. బియ్యం దందాను అరికట్టడంతో పాటు పేదల ఆకలి తీర్చేందుకుగాను కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమని, గడిచిన ఏడాదిన్నర కాలంలోనే ఎన్నో హామీలను అమలు చేసి ప్రజాపాలన అందిస్తూ ప్రజల ప్రశంసలు పొందుతుందన్నారు. పేదలు సన్న బియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మిర్యాలగూడ టౌన్ : పేదల కడుపు నింపేందుకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారని కాంగ్రెస్ జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షులు ముదిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని హౌసింగ్ బోర్డులో సన్న బియ్యం వండిన పేదల ఇంటిలో భోజనం చేశారు. పట్టణంలోని 25వ వార్డులో సన్నబియ్యం లబ్ధిదారుల ఇంటిలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, రెడ్డికాలనీ మాజీ కౌన్సిలర్ దేశిడి శేఖర్‌రెడ్డి, 25వ వార్డు కాంగ్రెస్ ఇంచార్జీ గోదాల జానకిరాంరెడ్డిలు కుటుంబ సమేతంగా వెళ్లి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రాథోడ్, సైదులు, పాష, విజయ, వెంకటలక్ష్మి, జ్యోతిలతో పాటు పలువురు మహిళలు తదితరులున్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



మాడుగులపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

మాడుగులపల్లి : ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో వచ్చిన ధాన్యాన్ని మాయిశ్చర్ వచ్చిన వాటికి వెంటనే కాంటాలు నిర్వహించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పనిచేస్తుందని,రైతులు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. ఐకేపీ కేంద్రాల్లో ఇప్పటివరకు ఎంతవరకు ధాన్యం కొనుగోలు చేశారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే తమను సంప్రదించాలని, గన్ని బ్యాగ్‌లు, లారీలు సమస్య లేకుండా చూస్తామని, రోజువారిగా కాంటాలను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎం రాజేష్, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలి

మిర్యాలగూడ : రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ పరిసర ప్రాంతాల మిల్లుల్లో ధర పొందవచ్చని తెలిపారు. మిర్యాలగూడ పట్టణ పరిసర ప్రాంతాల మిల్లుల్లో రోజుకు 4వేల ట్రాక్టర్లు కొనుగోలు చేసే సామర్థ్యం ఉంది,, కాని 6వేల నుంచి 8వేల ట్రాక్టర్ల వరకు ధాన్యం వస్తున్నందున ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రతి గింజ కొనుగోలు చేస్తామని రైతులు ఓపికతో ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటరమణచౌదరి, కుశలయ్య, శ్రీనివాస్, శ్రీనివాస్ ఉన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



సత్యనారాయణ, అధ్యక్షుడు



భూపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి



గంగాభవాని, మహిళా కార్యదర్శి

మిర్యాలగూడ టౌన్ : బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నేతి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా అలుగుబెల్లి భూపతిరెడ్డి, కోశాధికారిగా జి. సాయి కుమార్ యాదవ్(ఏకగ్రీవం), ఉపాధ్యక్షులుగా సుండి శ్రీనివాస్, జాయింట్ కార్యదర్శిగా చెలిమెల పద్మయ్య(ఏకగ్రీవం), స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా కొంక వెంకన్న (ఏకగ్రీవం), లైబ్రరీ కార్యదర్శిగా బాణాల ఉమాశంకర్(ఏకగ్రీవం) ఎన్నికయ్యారు. అదే విధంగా అసోసియేషన్ ఎగ్జిక్యూటీవ్ కమిటీ సభ్యులుగా కరుణం లింగయ్య(ఏకగ్రీవం), వాకిటి శ్రీనివాస్(ఏకగ్రీవం), తుములూరి వైకుంఠ ప్రసాద్(ఏకగ్రీవం), ధీరావత్ బాలునాయక్(ఏకగ్రీవం)గా ఎన్నికైనట్లు అధికారులు ఏచూరి శ్రీనివాస్, ఎం. పవన్‌కుమార్, మంద సైదులు తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వారికి నియామక పత్రం అందజేశారు.

గ్యాస్ ధరల పెంపుపై ఆందోళన



ఆలగడప పంచాయతీ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని కోరుతూ సీపీఎం, ఐద్వా ఆధ్వర్యంలో గురువార గ్యాస్ బండలతో నిరసన చేపట్టారు. పట్టణంలోని రామచంద్రగూడంలో ఐద్వా నాయకులు, మండలంలోని ఆలగడప గ్రామ పంచాయితీ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు చేపట్టిన కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడారు. జాతీయ స్థాయిలో చమురు ధరలు తగ్గితే ఏ దేశంలోనైనా గ్యాస్, పెట్రోల్ ధరలు తగ్గుతాయని.. కాని దేశంలో అందుకు భిన్నంగా ధరలను పెంచుతున్నారని విమర్శించారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ఇబ్బందులు పడుతున్న ప్రజలపై గ్యాస్‌ధరలు పెంచి వారి నడ్డి విరచడం ఎంతవరకు సబబు అన్ని ప్రశ్నించారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలపై ఆందోళనలకు సిద్ధం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రవినాయక్, మాజీ సర్పంచ్ పట్టెం చంద్రయ్య, వెంకటయ్య, పాపయ్య, సైదులు, నారాయణ, శ్రీను, కుమార్, వెంకన్న, ఐద్వా నాయకులు పాదూరి గోవర్ధన, జానికి, సంధ్య, అరుణ, సుగుణమ్మ, స్వాతి పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వం లక్ష్యం

- సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి



హాలియా : కొత్రివేనిగూడెంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి



నాగార్జునసాగర్ : బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే



హాలియా : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

హాలియా : పేదలకు సొంతింటి కల నెరవేరవేర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి అన్నారు. అనుముల మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పైలెట్ గ్రామంగా ఎంపికైన కొత్రివేనిగూడెం గ్రామంలో గురువారం ఆ ఇళ్ల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు. అర్హులైన ప్రతి పేదవారి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. అనంతరం హాలియా మున్సిపాలిటీలో తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, అనుముల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, పీడీ రాజ్‌కుమార్, కమిషనర్ రామదుర్గారెడ్డి, ఎంపీడీఓ సుజాత, నాయకులు నారాయణ గౌడ్, చంద్రారెడ్డి, శ్రీనివాస్, కిరణ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, నరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి అన్నారు. ఐకేపీ, కొత్తపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కొత్రివేనిగూడెం, కొత్తపల్లి, పేరూర్, వీర్లగడ్డ, చల్మారెడ్డిగూడెం, పాలెం, చింతగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడానికి ఏర్పాటు చేయగా కొత్రివేనిగూడెం, కొత్తపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, నారాయణగౌడ్, ఏపీఎం కళావతి, నాయకులు ఉన్నారు.

తిరుమలగిరి (నాగార్జునసాగర్) : మండలంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికై న నాయకునితండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే గిరిజన రైతులకు భూమి పట్టాలు అందిస్తామని, విద్యుత్ సమస్య తీర్చేందుకు నూతన సబ్‌స్టేషన్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ శేఖర్ రెడ్డి, వైస్ చైర్మెన్ చంద్రశేఖర్, నాయకుడు సాగర్ రెడ్డి, మునినాయక్, లాలు నాయక్, బిచ్చాలు, శౌరి పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులోకి ప్రభుత్వ వైద్యం

నాగార్జునసాగర్ : అన్ని వసతులతో ప్రజలకు అందుబాటులోకి వైద్యాన్ని తెచ్చేందుకే బస్తీద వాఖానను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డిలు తెలిపారు. గురువారం నందికొండ మున్సిపాలిటీలోని పైలాన్ కాలనీలో రూ.13లక్షలతో మరమ్మతులు చేసిన బస్తీదవాఖానను వారు సంయుక్తంగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కమలానెహ్రూ ఆసుపత్రితో పాటు బస్తీ దవాఖానకు కావాల్సిన సౌకర్యాలు కల్పించేందుకు మంత్రి దామోదర రాజనర్సింహయ్యను నియోజకవర్గానికి తీసుకువస్తానని తెలిపారు. ఇలాంటి ఆస్పత్రినే హాలియాలో ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తానని తెలిపారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఈ ఆసుపత్రిలో ఎంబీబీఎస్ డాక్టర్‌తో పాటు స్టాఫ్ నర్సులు ఉంటారని తెలిపారు. ఇక్కడ రక్త పరీక్షలు చేసి టీహబ్‌కు పంపుతారని, రోగనిర్ధారణ అనంతరం వైద్యం చేస్తారని, సీరియస్‌గా జబ్బులుంటే మరో ఆస్పత్రికి రెఫర్ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, డీసీహెచ్ వుట్ల శ్రీనివాస్,డాక్టర్ నగేశ్,డాక్టర్ శుభశ్రీ, కమీషనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతి రోజు పోషకాహారం తప్పనిసరి



నిడమనూరు : అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ఫరిదా



అడవిదేవులపల్లి : అంగన్‌వాడీ కేంద్రం-3లో

హాలియా : ప్రతి రోజూ తప్పనిసరిగా పోషకాహారాన్ని తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరిత అన్నారు. ఐసీడీఎస్ అనుముల ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం మండలంలోని హజారిగూడెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పోషకాహారంపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, విజయ, స్కూల్ హెచ్‌ఎం శ్రీలక్ష్మి, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : రక్తహీనత నిర్మూలనకు తీసుకునే జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలాకుమారీ, మెప్మా టీఎంసీ పాతేపాక ఐక్కయ్య అన్నారు. గురువారం పట్టణంలోని బాపూజీనగర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఓ వెంకటేశ్వర్లు, ఆర్‌పీలు రాజేశ్వరీ, భవాని, ఆశా వర్కర్ సరస్వతి, జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు రాణి, లక్ష్మి, విజయలక్ష్మిల పాల్గొన్నారు.

నిడమనూరు : పోషణ పక్షోత్సవాల్లో భాగంగా నిడమనూరు మండలంలోని మారుపాక అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం. పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ముకుందాపురం సెక్టార సూపర్‌వైజర్ ఫరిదా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు అలీ, అంగన్‌వాడీ టీచర్ మహాలక్ష్మి, పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-3లో గురువారం పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాణి వివరించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు నారాయణమ్మ, శోభ, రమాదేవి, మణేశ్వరీ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



హాలియా : చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హాలియా : అనుముల మండలంలోని ఇబ్రహీంపేట గ్రామానికి పలువురు బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను గురువారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యడవెల్లి నరేందర్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ డైరెక్టర్ ఎండీ అక్బర్‌ఖాన్, నాయకులు చాపల పెద్ద వెంకన్న, ఈగల రాములు, నాదేండ్ల అంజి, లింగాల ప్రభాకర్ పాల్గొన్నారు.

త్రిపురారం : మండలంలోని పెద్దదేవులపల్లి, నర్సింకటిగూడెం గ్రామాల్లో సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య పంపిణీ చేశారు. పేద ప్రజలు సీఎంఆర్‌ఎఫ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాము, నగేష్ యాదవ్, ముత్తయ్య, సంతోష్ కుమార్, గణేశ్, పాల్గొన్నారు.

నిడమనూరు : మండలంలోని గుంటిపల్లి గ్రామానికి చెందిన ఎల్ రామయ్యకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం గురువారం అందజేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రూపని కృష్ణయ్య, నర్సింగ్ విజయ్ కుమార్, ఎండీ జానీబా షా, మల్లయ్య, మల్లేష్, కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలో విద్యార్థుల ప్రతిభ

కొండమల్లేపల్లి : కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రంలో మార్చి 28న నిర్వహించిన చెవుడు, మూగ విద్యార్థుల క్రీడా పోటీల్లో కొండమల్లేపల్లి మండలంలోని జోగ్యతండా సమీపంలోని సాలిడార్ బధిరుల పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని పాఠశాల నుంచి స్థానిక చౌరస్తా వరకు నిర్వహించిన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎస్ఐ రామ్మూర్తి పాల్గొని మాట్లాడుతూ జీవితంలో ఎదగడానికి అవిటితనం అడ్డంకి కాదన్నారు. ప్రతి ఒక్కరిలో ఆత్మవిశ్వాసం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకుడు భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా తావూర్యనాయక్



నియామక ప్రతం అందుకుంటున్న తావూర్యనాయక్

మిర్యాలగూడ టౌన్ : గిరిజన సంఘం ఉద్యోగ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా హెచ్ఎం ధీరావత్ తావూర్యనాయక్‌ను నియమిస్తూ ఆ సంఘం వ్యవస్థాపకుడు ధీరావత్ రవినాయక్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం మిర్యాలగూడలో తావూర్యనాయక్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తావూర్యనాయక్ మాట్లాడుతూ తెలంగాణ లో గిరిజన ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాన్ని నిర్వహిస్తానన్నారు. తన నియామకానికి అన్ని విధాలుగా సహకరించిన వ్యవస్థాపకులు ధీరావత్ రవినాయక్, రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి కుర్ర శంకర్‌నాయక్, జవహర్‌నాయక్‌లకు ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు వాంకుడోతు అఖిల్‌నాయక్, నరేష్‌నాయక్, కోటినాయక్, మునినాయక్ తదితరులు పాల్గొన్నారు.